క్లుప్తంగా

నేటినుంచి చాంగటి కోటేశ్వరరావు పర్యటన

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో రెండు రోజుల పాటు చాంగటి కోటేశ్వరరావు ప్రవచనం ఉంటుందని కార్యక్రమ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు శివకుమార్ గురువారం తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం 6గంటలకు గురువుకు స్వాగతం పలుకుతామని, జ్యోతిప్రజ్వలన, హరిహరాదులకు పూజలు, పుష్పాంజలి ఉంటుందన్నారు. 6:30గంటల నుంచి చాగంటి ప్రవచనం 8:30గంటల వరకు కొనసాగుతుందన్నారు. శనివారం ఉదయం 10:30గంటల నుంచి 12గంటల వరకు ప్రవచనం ఉంటుందని తెలిపారు.

నేడు బంగారు మైసమ్మ బోనాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చైతన్యనగర్‌లో బంగారుమైసమ్మ ఆలయంలో శుక్రవారం బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్ తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముస్తాబు చేశామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవాలని పిలుపునిచ్చారు.

విగ్రహాల ప్రతిష్ట

అడ్డాకుల: మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లిలో ఈదమ్మ దేవాలయం వద్ద గురువారం ఈదమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ చేపట్టారు. గోపూజ, గణపతి పూజ, జలాధివాసం, ధాన్యాధివాసం, అగ్నిప్రతిష్ఠావనం, అవాహిత దేవతాహోమం, కక్ష్యజ్వాల, ప్రాణప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ చేసి భక్తిశ్రద్ధలతో విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ

జడ్చర్ల టౌన్: జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని గురువారం మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి టీషర్టులను పంపిణీ చేశారు. షీల్డులు, ఇతర బహుమతులను ఆయన వారికి అందజేశారు. క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి కేంద్ర ఫలాలు అందాలి

రాజాపూర్: దేశంలో ఉన్న ప్రతి వ్యక్తికి కేంద్ర ఫలాలు అందించాలన్నదే బీజేపీ ప్రధాన లక్ష్యమని మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సాహితిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ నినాదంతో బీజేపీ ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో బాలాగౌడ్, గంగాధర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, సంతోష్, రాజు, విజయ్ పాల్గొన్నారు.

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్

కోయిల్‌కొండ: విద్యార్థులు చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గూంజ్ సంస్థ మండల అధ్యక్షుడు రమేష్ అన్నారు. గురువారం మండలంలోని అంకిళ్లలో సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులను వితరణ చేశారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్, కృష్ణయ్య, గోపి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

జడ్చర్ల టౌన్: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం ఎంత మాత్రం ఆమోద యోగ్యం కాదని సీపీఎస్, యూపీఎస్ వద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, రవికుమార్, కిష్టయ్య, రామదాసు, ఉమాదేవి, మన్యం, నరేష్, కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు హాజరుకాని విద్యార్థులను గుర్తించండి

జడ్చర్ల టౌన్: పాఠశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థులను గుర్తించి ప్రతిరోజు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ రవీందర్ సూచించారు. గురువారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం కొంత తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఎవరైనా మూడురోజులు వరుసగా పాఠశాలకు రాకుంటే ఎందుకు రాలేదో విచారించి వారు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవాలన్నారు. తరగతుల వారీగా కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించే దిశగా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇబ్రహీం, సునీల్‌కుమార్, గోపాల్, యుగందర్, శంకర్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయం వద్ద భారీగా తరలివచ్చిన భక్తులు



ఘనంగా పోచమ్మ బోనాలు

నవాబుపేట కేంద్రంలో గురువారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో వైభవంగా సాగింది. – నవాబుపేట

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధుల డ్రైవ్‌పై వీసీ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిన చోట గడ్డి కత్తిరించాలన్నారు. పంచాయతీలలో అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. దోమల వ్యాప్తి చెందడం వల్ల వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఉందన్నారు. ఎవరైనా సీజల్ వ్యాధుల బారిన పడితే తక్షణమే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆస్పత్రికి తరలించాలన్నారు. అన్ని కేసులు డెంగీ జ్వరాలు కావని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఎంహెచ్‌ఓ పద్మశ్రీ, జిల్లా మలేరియా అధికారి భాస్కర్‌నాయక్, డాక్టర్ శశికాంత్, రఫి, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీపీఓ పార్థసారథి ఇతర అధికారులు పాల్గొన్నారు.



జానంపేటలో భక్తిశ్రద్ధలతో ఉర్సు



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో గురువారం రాత్రి గుమ్మామ్ బాబా దర్గా ఉర్సును నిర్వహించారు. గ్రామంలో గంధాన్ని ఊరేగింపు చేపట్టారు. జానంపేటతో పాటు మూసాపేట, చక్రాపూర్, వేముల, కొమిరెడ్డిపల్లి, తాళ్లగడ్డ, తిమ్మాపూర్, పోల్కంపల్లి నుంచి భక్తులు దర్గాకు వచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. పాటలకు యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తర్వాత దర్గా వద్దకు చేరుకుని గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా వద్ద వెలిసిన మిఠాయిల దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. కార్యక్రమంలో మహ్మద్ సత్తార్, బంగ్లా బాబా, జాహంగీర్, మహ్మద్ ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా స్పోర్ట్స్‌డే



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గురువారం స్పోర్ట్స్ డేలో భాగంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈడీ ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీలో..

జేపీఎన్‌సీ కళాశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గండీడ్: మండలకేంద్రంతో పాటు వెన్నాచెడ్ బాలుర ఉన్నత పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జనార్దన్, పీడీలు రాము నాయక్, ఆంజనేయులు, శ్రీనివాస్, తిర్పతయ్య, కృష్ణయ్య, శ్రీకాంత్, రామేశ్వరి, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు భాష వాడుక, ఔన్నత్యం కోసం ఎంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు.

గండీడ్: మండలంలోని వెన్నాచెడ్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. రమేష్, పుష్పమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి శివారులో ఉన్న సర్వేనంబర్ 68లో కొందరు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు ప్రజాసంఘాల నాయకులు గురువారం తహసీల్దార్ కిష్ట్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్థలంలో పలువురు గ్రామస్తులు రాత్రికిరాత్రే నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. అట్టి ప్రభుత్వ స్థలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో బాల్‌రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబజార్ హనుమాన్‌దేవాలయం వద్ద యాదవసంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రంగనాథ ఆలయ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి ఉట్టిని లాగగా యాదవసంఘం యువకులు కొట్టేందుకు పోటీ పడ్డారు. గంటపాటు ఉట్టి కార్యక్రమం అలరించింది. వేడుకల్లో భాగంగా వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం శ్రీకృష్ణుడి ఊరేగింపు శోభాయమానంగా సాగింది. ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో ఊరేగింపు కొనసాగించారు.

ఉట్ల కార్యక్రమం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఉట్లు కొట్టే కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి రాంమందిర్‌చౌరస్తా, హనుమాన్‌పురా తదితర ప్రాంతాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా రాంమందిర్‌చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, శంకర్, సత్యనారాయణయాదవ్, మద్ది యాదిరెడ్డి, గౌలి వెంకట్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రాంమందిర్‌చౌరస్తాలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న యువకులు

కార్మికుల సమస్యలపై జెడ్పీ సీఈఓ విచారణ

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై వ్యక్తిగతంగా జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి గురువారం వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం 22రోజులుగా ఆందోళనలు చేస్తున్న కార్మికులు తమ సమస్యలను సీఈఓకు రాతపూర్వకంగా తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఏకపక్షంగా కార్మికులపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని, యూనియన్ నాయకుడిని ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశానని, పది మంది కార్మికులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు బెదిరిస్తున్నారని సీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ నాగేష్ అసభ్యకరంగా మాట్లాడుతున్నారని, సెలవులు అడిగితే ఇవ్వరని, కామాటీలను తొలగించి ఇతర విధుల్లో నియమించారని ఆయనకు వివరించారు. పీఎఫ్ డబ్బులు ఖాతాలో వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వనపర్తి, భూత్పూర్ మాదిరిగా ఒక పూట 8గంటల పని అమలు చేయాలని కోరారు. రెండు పూటల విధానం వల్ల రోజు నాలుగు సార్లు విధులకు వచ్చిపోవాల్సి వస్తుందని, దానికోసం ఆటో ఖర్చులు రూ.100 అవుతున్నాయని, నెలకు రూ.3వేలు పెట్టాల్సి వస్తుందని ఆయనకు వివరించారు. విచారణ అధికారి జెడ్పీ సీఈఓకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, వెంకటేశ్ సమస్యలను వివరించారు.



కార్మికుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి

ఆందోళన వాయిదా

22 రోజులుగా చేస్తున్న ఆందోళనలు వాయిదా వేస్తున్నామని మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ప్రకటించారు. కార్మికుల సమస్యలపై జెడ్పీ సీఈఓ విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ తీసుకునే చర్యల ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

రుణమాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోండి

దేవరకద్ర రూరల్: ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ లబ్ధి పొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్ సూచించారు. గురువారం కౌకుంట్ల మండల కేంద్రంలోని రైతువేదికలో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు త్వరలోనే రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల మాఫీ కానీ అర్హులైన రైతులు సంబంధిత వ్యవసాయ అధికారులకు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేవైసీ, ఆధార్‌లో ఏమైనా సవరణలు ఉంటే సంబంధిత శాఖలలో సరిచూసుకోవాలని తెలిపారు. అలాగే రూ.2 లక్షలకు పైబడి రుణాలు ఉన్న రైతులు మిగతా డబ్బులు బ్యాంకులకు చెల్లించే విషయంలో ప్రభుత్వం నుంచి మాకు ఎటువంటి సమాచారం రాలేదని, బ్యాంకుకు కట్టడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివకుమార్, ఏఈఓ ప్రవళిక, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ వెంకటేష్

రైతుల వివరాల సేకరణ

మహబూబ్‌నగర్ రూరల్: రుణమాఫీ కాని రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. గురువారం మండలంలోని బొక్కలోనిపల్లిలో వ్యవసాయశాఖ అధికారి శృతి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగానే కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు.

వెలుగొమ్ములలో వైద్య శిబిరం

మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు పెద్ద మొత్తంలో నమోదు అవుతుండడంతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. గ్రామంలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరికైన జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు

దేవరకద్ర రూరల్: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ నాగన్న సూచించారు. గురువారం కౌకుంట్ల మండల కేంద్రంలో ఉత్సవ కమిటీ సభ్యులు, వినాయక మండప నిర్వాహకులతో శాంతి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి మండపం వద్ద ఒక వలంటీర్ రాత్రి సమయంలో ఉండాలని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాటు చేసే మండపాలకు పోలీసులు, విద్యుత్ శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని, డీజేలు పెట్టరాదని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

నవాబుపేట: వినాయక ఉత్సవాలు సామరస్యంగా నిర్వహించాలని రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవాలపై మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీటీ గాయత్రి, ట్రాన్స్‌కో ఏఈ సతీష్ పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: పండగలు భక్తిశ్రద్ధలకు ప్రతీకలని ప్రజలు దీన్ని మనసులుంచి క్రమశిక్షణతో నడుచుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన అన్ని వర్గాల ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గణేష్, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సహకరించుకోవాలన్నారు.



కౌకుంట్లలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగన్న

రోడ్డు బాగు చేయాలని నిరసన

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలంలోని వెంకటగిరి– పేరూర్ మధ్య గల రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు గురువారం రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వెంకటగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే గేట్ దగ్గర అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు ఆరు నెలల క్రితం గేట్‌ను మూసివేశారు. ప్రజల రాకపోకలకు వెంకటగిరి– పేరూర్‌ల మీదుగా తాత్కాలికంగా మట్టి రోడ్డును ఏర్పాటు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి, వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోగా, కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని గ్రామస్తులు వాపోయారు. అధికారులకు ఎన్నోసార్లు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎల్లయ్య, ఎస్‌ఐ నాగన్న గ్రామస్తులను సముదాయించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అప్పటివరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో మట్టివేసి ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

దేవరకద్రలో 30 చెక్‌డ్యాంలు నిర్మించాం



శాఖాపూర్ చెక్‌డ్యాం వద్ద కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: బీఆర్‌ఎస్ హయాంలో దేవరకద్ర నియోజకవర్గంలో రైతులను ఆదుకుని సాగును పెంచడానికి వాగుల్లో 30 చెక్‌డ్యాంలను నిర్మించామని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శాఖాపూర్ వద్ద పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం మొదటిసారి నిండుకోవడంతో గురువారం ఆయన చెక్‌డ్యాంను సందర్శించి నీళ్లలో పూలు చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాగుల్లో చెక్‌డ్యాంలు నిర్మించడం వల్ల పరిసరాల్లోని రైతుల బోరుబావుల్లో నీటిమట్టం పెరిగిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ముందు చూపుతోనే ఈ ప్రాంతంలో కొన్ని వేల ఎకరాల్లో ఆయకట్టు పెరిగిందన్నారు. కర్వెన ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు.

యువకుడికి సత్కారం..

శాఖాపూర్ చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త వెంకటేష్‌సాగర్ కుమారుడు యమున సాగర్ ఇటీవల మిషన్ భగీరథలో ఏఈఈ ఉద్యోగం సాధించడంతో మాజీ ఎమ్మెల్యే ఆల శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జయన్నగౌడ్, ఖాజాహెరీ, రమేష్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

బేషరతుగా రుణమాఫీ చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రైతుల రుణమాఫీని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో భాగంగా ఆగస్టు 15వ తేదీ వరకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఛాలెంజ్ చేశారని తెలిపారు. 50 శాతం మంది రైతులకు కూడా మాఫీ చేయలేదని ఆరోపించారు. అడిగిన ప్రతి రైతుకు కొత్త రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారులు మాఫీపై రైతులకు స్పష్టతనివ్వాలని కోరారు. కిల్లెగోపాల్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, భీమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

హన్వాడ: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని కొత్తపేట కాంప్లెక్స్ జీహెచ్‌ఎం ఇందిరాదేవి సూచించారు. గురువారం ఆమె మండలంలోని చిర్మల్‌కుచ్చతండాలో పర్యటించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

పకడ్బందీగా ఓటర్ల సర్వే

చిన్నచింతకుంట: ఓటర్ల జాబితా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కృష్ణయ్య బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం మండలంలోని ఉంద్యాలలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి ఓటర్ల జాబితా సర్వేను పరిశీలించారు. ఎలాంటి తప్పులు లేకుండ సరిచూడాలన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు జాబితాలో పేరు నమోదు చేయించాలన్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: స్థానిక ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న అనుశ్రీ సింఘ్ బుధవారం నుంచి కనిపించడం లేదని తండ్రి నార్ సింఘ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని పలు ఇళ్లలో పనిచేసేందుకు వెళ్తున్న తన కూతురు బుధవారం పనులు చేసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆమె వద్ద ఉన్న ఫోన్ కూడా కలవడం లేదని తెలిపారు. తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్‌రావు తెలిపారు.

గురుకుల పని వేళలు మార్చండి



దేవరకద్ర: గురుకుల పాఠశాలల పని వేళలు మార్చాలని టీఎస్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీ డిమాండ్ చేసింది. గురువారం మండలంలోని మైనార్టీ గురుకుల, సాంఘిక సంక్షేమ బీసీ గురుకుల, ఎంజేపీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిటీ సర్వే నిర్వహించి అధ్యాయనం చేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గతంలో అన్ని గురుకులాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు పని వేళలు ఉండేవని, ఆకస్మికంగా ఉదయం 8 గంటలకు మార్చారన్నారు. రాత్రి స్టడీ అవర్స్ వరకు పొడిగించడం వల్ల 12 గంటల పాటు డ్యూటీ చేయాల్సి వస్తుందని తెలిపారు. గతంలో మాదిరిగా పని వేళలు మార్చాలని, 010 పద్దు కింద జీతాలు చెల్లించాని, హెల్త్ కార్డులు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, అజయ్, శంకర్, వేణుగోపాల్, కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం అందజేత

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని తబస్సుము హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసిస్తుంది. ఆమె ఉన్నత చదువులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి గురువారం రూ.50వేలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

వయ్యారిభామ కలుపు నివారణపై అవగాహన



మిడ్జిల్: జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కొత్తూర్‌లో గురువారం వయ్యారిభామ కలుపు నిర్మూలనపై గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వయ్యారిభామ ఏపుగా పెరిగి పంట పొలాలను నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోవడం జరుగుతుందని వాటిని వెంటనే నివారించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

దేవరకద్ర: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థులలో ఉండే రక్తహీనతను అరికట్టడానికి ఐరన్ మాత్రలు వేసుకోవాలని సిబ్బంది సూచించారు.

ఇంటింటికి తిరిగిన బీఎల్‌ఓలు

మండల కేంద్రంలో బీఎల్‌ఓలు ఇంటింటి తిరిగి ఓటర్ల వివరాలు నమోదు చేసుకున్నారు. మృతి చెందిన వారి వివరాలను, పెళ్లి చేసుకుని వెళ్లి పోయిన వివరాలను సేకరించారు. అలాగే ఓటు హక్కు లేని వారి పేర్లను నమోదు చేసుకున్నారు.